కల్వర్టులకు కష్టకాలం


కల్లుదేవకుంట-సూగూరు గ్రామాల మధ్య కుంగిన కల్వర్టు


తుంగభద్ర-నారాయణపురం గ్రామాల మధ్య వంతెనపై ఏర్పడిన గుంత

- పలుచోట్ల దెబ్బతిన్న వంతెనలు, కుంగిన కల్వర్టులు
- రక్షణ గోడలు, సూచిక బోర్డులు లేక ప్రమాదాలు జరిగే అవకాశం
- తక్కువ ఎత్తులో ఉండడంతో వర్షా కాలంలో రాకపోకలకు ఇబ్బందులు


ఆదోని - రాయచూర్ ప్రధాన రహదారిలో వర్షపు నీటికి కొట్టుకొచ్చిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం

మంత్రాలయం రూరల్: పల్లెలను పట్టణాలకు అనుసంధానం చేస్తూ నిర్మించిన రహదారులపై వంతెనలు శిథిలమవుతున్నాయి. నాణ్యత లేకుండా నిర్మించడంతో కొద్దిపాటి వర్షపు నీటి ప్రవాహానికే కోతకు గురవుతున్నాయి. మంత్రాలయం మండలంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖలు రహదారులు నిర్మించాయి. నీటి ప్రవాహం ఏర్పడే చోట్ల కల్వర్టులు, వంతెనలు ఏర్పాటు చేశారు. కల్వర్టులు కుంగిపోవడం, రక్షణ గోడలు లేకపోవడంతో, ఉన్న చోటే కిందకు కుంగిపోవడం, ఇరువైపులా పగుళ్లు ఏర్పడటం జరుగుతున్నాయి. వర్షాకాలంలో వంతెనలపై నీరు ఎంత ఎత్తుల్లో ప్రవహిస్తుందనే సూచికలు సైతం ఏర్పాటు చేయలేదు.

నియోజకవర్గంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులు

మంత్రాలయం మండలం మాధవరం-రాంపురం మధ్యలో వంకపై నీరు ప్రవహిస్తే రాకపోకలు నిలిచి పోతాయి. కల్వర్టు చిన్నదిగా ఉండటమే ఇందుకు కారణం. 52బసాపురం-తుంగభద్ర, తుంగభద్ర-నారాయణపురం గ్రామాల మధ్య వంతెన నిర్మాణాన్ని నాణ్యత చేపట్టకపోవడంతో నడి భాగంలో ప్రమాదకరమైన గుంత ఏర్పడింది. ఇరువైపులా రక్షణ గోడ, సూచికలు లేకపోవడంతో నీటి ప్రవాహం ఉన్న సమయంలో వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. రచ్చమర్రి, మాలపల్లి గ్రామాల మధ్య మూడు చోట్ల చిన్నపాటి కల్వర్టులు నిర్మించారు. కల్వర్టు కింది భాగంలో మట్టి కొట్టుకుపోవడంతో కుంగిపోయింది. సూచిక బోర్డులు లేకపోవడం, రక్షణ గోడ నిర్మించకపోవడంతో రాత్రి పూట ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. బూదూరు-వి.తిమ్మాపురం, వి.తిమ్మాపురం-వగరూరు గ్రామాల మధ్య రెండు వాగులపై వంతెనలు నిర్మించారు. కొద్దిపాటి వర్షానికే వర్షపు నీరు వంతెనపై ప్రవహించి రాకపోకలు నిలిచి పోతున్నాయి. దీనికి తోడు రక్షణ గోడ, సూచికలు ఏర్పాటు చేయలేదు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా వాహనదారుడు వాగులో పడాల్సిన పరి స్థితి.కల్లుదేవకుంట-సూగూరు గ్రామాలకు వెళ్లే దారిలో కల్లుదేవకుంట శివారులో అధికారులు నిర్మించిన కల్వర్టు కోతకు గురై పెద్ద గుంత ఏర్పడింది. దీనికి తోడు ఎస్ ఆకారంలో రహదారి ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కన్పించవు. అతివేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పితే వాగులోకి పడాల్సిందే. మంత్రాలయం-నాగలదిన్నె రహదారిలో సుంకప్ప తాత, కొండయ్య రూం వద్ద కొద్దిపాటి వర్షానికే వాగులో నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో రెండు చోట్ల వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- కోసిగి మండలంలో దొడ్డి బెళగల్-కోసిగి గ్రామాల మధ్య కోసిగి సమీపంలో మాలంబండ వాగులో పులికనుమ నీరు నిత్యం ప్రవహిస్తుంది. వర్షకాలంలో చిన్న వర్షానికే వాగు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. పలు సార్లు వంతెన నిర్మించాలని అధికారులకు మొర పెట్టుకున్న పట్టించుకునే నాథుడే లేడు. కోసిగి రైల్వే గేటు దాటిన తర్వాత హాల్వి రహదారిలో చేప వాగుపై చిన్నపాటి కల్వర్టు నిర్మించారు. చిన్నది కావడంతో కల్వర్టుపై భాగంలోంచి నీరు ప్రవహిస్తోంది. కోసిగి- జుమ్మాలదిన్నె గ్రామాల మధ్యలో కల్వర్టు ఏర్పాటు చేయడంతో వర్షానికి భూమి కుంగి బస్సులు, ఆటోలు ఇరుక్కుపోతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్‌జాం అవుతుంది. జంపాపురం-ఐరన్‌గల్లు గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టు కంకర తేలి, చీలికలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. కోసిగి-సజ్జలగుడ్డం గ్రామాల మధ్యలో మోడల్ స్కూల్ దాటిన వెంటనే వచ్చే కల్వర్టు ప్రమాదకరంగా మారింది.
- పెద్దకడబూరు-దొడ్డిమేకల, కంబళదిన్నె-జాలవాడి గ్రామాల మధ్యలో ఉండే కల్వర్టులు గత కొన్నేళ్ల క్రితం నిర్మించినవి కావడంతో వర్షపు నీటి ప్రవాహానికి దెబ్బతిన్నాయి. ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది.
- కౌతాళం మండలంలో కుంటన్‌హాల్-ఉప్పరహాల్ గ్రామాల మధ్యలో ఉండే కల్వర్టు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కామవరం-ఉరుకుంద గ్రామాల మధ్యలో ఎల్లెల్సీ కాలువపై నిర్మించిన వంతెన వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ఆదోని మండలం ఢణాపురం-నాగనాథనహళ్లి గ్రామాల మధ్యలో ఉండే పెద్దవంక వద్ద చిన్న పైపులు వేసి మోరీ ఏర్పాటు చేశారు. అధిక వర్షం కురిస్తే ఆదోని-హోళగుంద మండలాల్లోని గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. ఆదోని-శిరుగుప్ప రహదారిలో పెద్దహరివాణం వద్ద చిన్న కల్వర్టు కావడంతో వర్షపు నీరు పైకెక్కి ప్రవహిస్తుంది. ఆదోని-రాయచూర్‌కి వెళ్లే రహదారిలో పెద్ద తుంబళం-మాధవరం గ్రామాల మధ్య కోసిగికి వెళ్లే రహదారి సమీపంలో వంతెన నిర్మించారు. కొద్దిపాటి వర్షానికే రాకపోకలు నిలిచిపోతాయి. రక్షణ గోడ కరువైంది.

పెద్ద ఎత్తున్న కల్వర్టు నిర్మించాలి



ఆదోని-రాయచూర్ ప్రధాన రహదారిలో పెద్ద తుంబళం గ్రామ శివారులో ఉన్న వంకపై వంతెన చిన్నదిగా నిర్మించారు. వర్షం అధికంగా వస్తే గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ జాం అవుతుంది. అధికారులు స్పందించి కల్వర్టును ఎత్తులోనిర్మించాలని కోరుతున్నాం. వాగు ప్రవహిస్తున్న సమయంలో ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో 108, ఎమర్జెన్సీ వాహనాలు వస్తే గ్రామస్తులంతా కలిసి జేసీబీకి తాడు కట్టి వాగు దాటించే పరిస్థితి ఏర్పడుతుంది.

– నరసయ్య, పెద్దతుంబళం గ్రామం

ప్రతిపాదనలు పంపాం

మంత్రాలయం మండలంలో దెబ్బతిన్న కల్వర్టు, రోడ్లకు సంబంధించి నివేదికలు పంపాం. ఇప్పటికే కొన్ని రోడ్డు పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల నుంచి ఉత్తర్వులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– సాయి సురేష్, ఏఈఈ, మంత్రాలయం

క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు


ద్రాక్ష, డ్రైఫ్రూట్స్ అలంకరణలో మాతా పరమేశ్వరిదేవి

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఎంఎం కాలనీలో వెలిసిన శ్రీ మాతా పరమేశ్వరిదేవి 35వ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా 2వ రోజు సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, నైవేద్యం, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు ఆలయ కమిటీ నిర్వాహకులు స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌కు శాలువా వేసి ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీసేవ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, కొండయ్య, రామకృష్ణ, నరసింహులు, కౌన్సిలర్ చిన్నా, యువకులు, కాలనీపెద్దలు పాల్గొన్నారు.

ఆటో అదుపుతప్పి బాలుడి మృతి


తాటిచెట్టును ఢీకొట్టిన ఆటో


మృతిచెందిన బాలుడు బోయ గణేష్ (ఫైల్)

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం సమీపంలో సోమవారం సాయంత్రం ఓ ఆటో అదుపుతప్పి తాటిచెట్టును ఢీకొన్న ఘటనలో బాలుడు మృత్యువాత పడ్డాడు. పెద్దతుంబళం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన సమాచారం మేరకు వివరాలు.. ఏపీ 21 సీవై 1445 నంబర్ గల ఆటో మాధవరం మండలం చౌటుపల్లి నుంచి పెద్దతుంబళం వైపు వస్తోంది. పెద్దతుంబళం సమీపంలో వస్తుండగా ఆటో ముందు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న తాటిచెట్టును ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న బోయ గణేష్ (6) ఎగిరి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆటో డ్రైవర్ ఈరన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విలేకరులకు తెలిపారు.

పాలీసెట్ మాక్ టెస్ట్‌కు స్పందన

ఆదోని రూరల్: ఆదోని-ఆలూరు రోడ్డులోని బీమా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఏపీ పాలీసెట్ మాక్ టెస్ట్‌ను కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టెస్టుకు హాజరైన ప్రతి విద్యార్థి క్వాలిఫై అయ్యాడని చెప్పారు. ఈనెల 10వ తేదీన జరగబోయే పాలీసెట్, 15న జరగనున్న ఎంసెట్ పరీక్షలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి

కౌతాళం: రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే విత్తనాలను సరఫరా చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో ఏఓ శేషాద్రి,ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి మెమోరాండం సమర్పించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న మాట్లాడుతూ.. నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేలా ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలన్నారు. అధికవర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలని డిమాండు చేశారు.నాయకులు వీరేష్, ప్రకాశ్,వెంకన్న,సత్యప్ప,కేశవ,వలి పాల్గొన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణంలోని చౌదరిబావి వద్ద సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో బోయ మద్దిలేటి అనే వ్యక్తి సంచుల్లో నాటుసారాను తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ విక్రమసింహా విలేకరులకు తెలిపారు. సదరు వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా సిబ్బంది సోదాలు చేయడంతో సంచుల్లో 30 లీటర్ల నాటుసారా బయటపడిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరైనా నాటుసారా, కర్ణాటక మద్యం విక్రయించడం, సరఫరా వంటివి చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ విక్రమసింహా

ఈరన్న స్వామి దర్శనానికి పోటెత్తిన జనం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలను చేపట్టారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కోసిగి(మంత్రాలయం): ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య తెలిపారు. సోమవారం కోసిగి ఆర్డీటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రము, రేషన్ కార్డు, రెండు పాస్ సైజ్ ఫొటోలతో కోసిగి ఆర్డీటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్నవారికి ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ చాటుకున్న వారికి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు ఆర్డీటీ సహకారంతో ఉచితంగా విద్యఅందించనున్నట్లు వెల్లడించారు. కోసిగి, మంత్రాలయం, కౌతాళం మండలాల పరిధిలో విద్యార్థులు కోసిగి కార్యాలయంకు వచ్చిదరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

న్యాయమూర్తికి ఘన స్వాగతం

ఆదోని రూరల్: పదోన్నతిపై రాజోలు నుంచి ఆదోనికి వచ్చిన పీడీఎం న్యాయమూర్తి రమణారెడ్డికి ఆదోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రమణారెడ్డి మాట్లాడుతూ చివరి ప్రయత్నంగా న్యాయస్థానాలకు వచ్చిన కక్షిదారులకు కోర్టు నుంచి న్యాయం దొరకాలని అందుకోసం న్యాయవాదులు పని చేయాలని సూచించారు. జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పీజేసుధ మాట్లాడుతూ..కోర్టు భవనాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. సీనియర్ న్యాయవాదులు విశ్వనాథ్ రెడ్డి, దేశాయ్, విరుపాక్షి రెడ్డి, బార్ అసోసియేషన్ నాయకులు,జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోని అర్బన్: స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత ప్రారంభించారు. ముందుగా సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్ వద్దు.. పుస్తకం ముద్దు అని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌తో సమయం వృథా చేయకుండా గ్రంథాలయానికి వెళ్లి మంచి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారిణి సుజాత మాట్లాడుతూ.. ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు వేసవి విజ్ఞాన తరగతులు ఉంటాయన్నారు. విద్యార్థులకు బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, పెయింటింగ్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రామా, యోగాపై శిక్షణ ఇస్తామని వెల్లడించారు.

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో మండల విద్యాధికారి సువర్ణల సునియం సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనం నిర్వహించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా గ్రంథాలయంలోని పుస్తకాలను చదవాలన్నారు. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానంతో పాటు పోటీ పరీక్షలలో ప్రతిభ చాటవచ్చన్నారు. సమ్మర్ క్యాంప్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని లైబ్రేరియన్ ఆశాజ్యోతి కోరారు. ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ లక్ష్మన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఎద్దు, ఆవు మృతి


పోతుగల్లులో మృతి చెందిన ఆవు, ఎద్దు

కృష్ణగిరి: పిడుగుపాటుకు ఎద్దు, ఆవు మృతి చెందాయి. పోతుగల్లు గ్రామానికి చెందిన కిందింటి వెంకటేశ్వర్లు, చంద్రన్నలకు చెందిన మూడు ఎద్దులు, ఆవును ఇంటి సమీపంలోని వామిదొడ్డిలో కట్టేశారు. సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు గురై వెంకటేశ్వర్లుకు చెందిన ఎద్దు, చంద్రన్న ఆవు మృతి చెందగా మరో రెండు ఎద్దులు తప్పించుకున్నాయి. రూ.1.20 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు విలపించారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


పాల్గొన్న కమీషన్ ఏజెంట్లు, రైతులు

ఆదోని అర్బన్: దేశానికి రైతు వెన్నెముక అని, రైతును మోసం చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా మజర్‌అహ్మద్ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. స్థానిక పత్తి టీఎంసీ యార్డులో జరిగిన కార్యక్రమంలో యార్డు గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో యార్డు సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి మజార్‌అహ్మద్‌ను చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకుని నిజాయితీగా కష్టపడే వారందరికీ పదవులు కల్పిస్తామన్నారు. ఆదోనిలో ఏడుగురికి కార్పొరేషన్, చైర్మన్లు, ఒకరికి ఎమ్మెల్సీ పదవి కల్పించినట్లు గుర్తు చేశారు. మార్కెట్ యార్డులో ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించేలా యార్డు చైర్మన్, సెక్రటరీ, పాలకమండలి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్డీ లేకుండా పంట అమ్మిన వెంటనే రైతుకు డబ్బు ఇవ్వాలని సూచించా రు.వ్యాపారస్తులు ఐపీలు పెట్టడంతో కమీషన్ ఏజెంట్లు నష్టపోకుండా వ్యాపారస్తులు దిగుబడులు కొన్న 12రోజుల్లో పేమెంట్ చేయాలన్న నిబంధన పెట్టా మన్నారు. ప్రతిరోజూ సెక్రటరీ ప్రభుత్వ నియమ, నిబంధనలు యార్డులో అనౌన్స్‌మెంట్ చేయాలని సూచించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ఎడ్ల బండ్లపై ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, యార్డు చైర్మన్ మజార్‌అహ్మద్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ అన్ను, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి ప్రధాన రహదారుల్లో ఊరేగింపుగా యార్డుకు వెళ్లారు. యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, యార్డు డైరెక్టర్లు, ప్రముఖులు, వ్యాపారస్తులు, ఏజెంట్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై కొరడా

ఎమ్మిగనూరుటౌన్: నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై సోమవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, సత్యన్న, వార్డు సచివాలయ సిబ్బంది గాంధీ సర్కిల్‌లోని పలు దుకాణాలపై దాడులు చేసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు స్వాధీనం చేసుకొని వ్యాపారులకు జరిమానాలు విధించారు.

కౌలు కార్డుతో ప్రయోజనం

తుగ్గలి: కౌలు కార్డులతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఏఓ పవన్‌కుమార్ అన్నారు. సోమవారం రాతన ఆర్‌బీకేలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించి కౌలు కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వీఆర్‌ఓ నాగేంద్ర ఉన్నారు.

స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం


స్పందన కార్యక్రమంలో అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్


అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ రఘునాథ్ రెడ్డి

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, స్పందనలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. రీ సర్వేలో ఏదైనా సమస్య ఉంటే సంవత్సరంలోపు ఆ మండలానికి సంబంధించి మొబైల్ మెజిస్ట్రేట్ లేదా రీసర్వే ఉప తహసీల్దార్ అప్పీల్ చేసుకోవచ్చన్నారు.

స్పందనలో ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో కొన్ని

- హొళగుంద మండలం కోగిలతోట గ్రామానికి చెందిన ఇందిరమ్మకు సర్వే నంబర్ 248/ఏలో 5.24 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి రెవెన్యూ రికార్డుల మేరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ చేసుకున్నారు.
- మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామానికి చెందిన హనుమంతు సర్వేనంబర్ 162/జీలోని 2.29 ఎకరాల భూమిని రీసర్వే చేసి హద్దులు చూపాలని అర్జీ సమర్పించాడు.
- కౌతాళం మండలం పొదలకుంట గ్రామానికి చెందిన యాకోబు సర్వే నంబర్ 82/సీలో 2.52 ఎకరాలు, 82/సీలో 21 సెంట్ల భూమి మొత్తం 2.73 ఎకరాల భూమిని ఆక్రమణకు గురైందని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ చేసుకున్నాడు.
- ముస్లిం శ్మశాన వాటికకు భూమి లేదని గ్రామంలో ప్రభుత్వ భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలని పెద్దకడబూరు మండలం జాలవాడి గ్రామ ముస్లింలు అర్జీ సమర్పించారు.

కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఆర్టీసీ డిపో మేనేజర్ రఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, బీసీ వెల్ఫేర్ లక్ష్మినారాయణ, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పట్ల నిర్లక్ష్యం వద్దు

ఆదోని టౌన్: సమస్యల పరిష్కారమే స్పందన లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ప్రతిసోమవారం జరిగే స్పందనలో చేసుకున్న దరఖాస్తు (సమస్య) పరిష్కారమయ్యిందా లేదా అని గుర్తించేందుకే వెంటనే రసీదు ఇస్తున్నట్లు తెలిపారు. పరిష్కారం కాని పక్షంలో మరో వారం రోజుల్లో జరిగే స్పందనలో తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ అర్జీదారులకు సూచించారు. అర్జీతో పాటు లబ్ధిదారులు ఆధార్ నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. ఫిర్యాదులపై సంబంధిత సెక్షన్ల అధికారులకు తక్షణమే సిఫారసు చేసి పరిష్కరించనున్నట్లు చెప్పారు. 24వ వార్డులో ముఖద్వారం వద్ద కొత్త బ్రిడ్జిని నిర్మించాలని ఇంజినీరింగ్ విభాగానికి అర్జీ అందజేశారు. ప్రభుత్వ మైనార్టీ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్ మాసా మసీద్ కాలనీలో ఆక్రమణలు, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఆ ప్రాంతం ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు అర్జీ పెట్టుకున్నారు. శంకర్‌నగర్‌లో పార్వతమ్మ ఇంటి వెనకాల మురుగు కాలువలను నిర్మించాలని ఆ వీధి ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. సుంకులమ్మవ్వ గుడి వద్ద మురుగు కాలువలను ఏర్పాటు చేయాలని కాలనీవాసి ఫిలిప్స్‌తో పాటు మరికొంత మంది అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందజేత


ఉద్యోగాలు సాధించిన వారితో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, అధ్యాపకులు

ఆదోని అర్బన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు పొందిన 35 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కళాశాల ఆవరణలో ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే ఉద్యోగాలు పొందిన విద్యార్థులను, వారిని తీర్చిదిద్దిన అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు. త్వరలోనే పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనం ప్రారంభోత్సవం జరగనుందని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారులు రామసుబ్బారెడ్డి, కిరణ్‌నాయక్, అధ్యాపకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కనకదిన్నె గ్రామ సమీపంలో బైక్‌పై వెళ్తుండగా అకస్మాత్తుగా జింక అడ్డు రావడంతో జరిగిన ప్రమాదంలో పత్తికొండకు చెందిన కార్పెంటర్ తెర్నేకల్ ఉశేన్‌సా (51) దుర్మరణం చెందాడు. వివరాలు.. పత్తికొండ నుంచి దేవనకొండ మండలం పుల్లాపురం గ్రామంలో కార్పెంటర్ పని నిమిత్తం ఉశేన్‌సా, మరో కార్పెంటర్ మక్తుంతో కలిసి బైక్‌పై బయల్దేరారు. మార్గం మధ్యలో కనకదిన్నె గ్రామ సమీపంలో వెళ్తుండగా అకస్మాత్తుగా జింక రోడ్డుకు అడ్డంగా వచ్చి బైక్‌ను తగిలింది. బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఉశేని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. గాయపడిన మక్తుం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.